234) కాంభోజి

ప|| ఏమని విన్నవింతు నిదివో నాభాగ్యము | కామించి మీశరణంటి గమలారమణా ||

చ|| కలది యందరికైతే గర్మఫలము | కెలన నాకైతే నీకృపాఫలము |
అల సురలకు మథితామృతము | నెలకొన్న నాకైతే నీనామామృతము ||

చ|| సకలాత్మలబ్రదుకు సంసారమూలము | ప్రకటించ నాకైతే నీపాదమూలము |
వెకలిలోకులరతి వీధివీధిని నా- | త్రికరణరతి నీదివ్యభావవీధిని ||

చ|| రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు | సంగతి నాకు నీభక్తజనులయందు |
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి | చెంగట నాధ్యానము నీశ్రీమూర్తియందు ||